రక్షణ రంగంలో యువతకు అపార అవకాశాలు

- డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ పి.నర్సింహారావు, ఆర్మీ రిటైర్డ్ ఆఫీసర్ కర్నల్ రంజిత్ చాకో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ నర్సింహారావు

బొమ్మలరామారం, మార్చి 15 : రక్షణ రంగంలో యువతకు అపార అవకాశాలున్నాయని డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ పి.నర్సింహారావు, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కర్నల్ రంజిత్ చాకో అన్నారు. మండలంలోని యావాపూర్ గ్రామంలోని యువ ఫిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ శ్రీశాంతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఆర్మీలో అవకాశాల గురించి విద్యార్థులకు తెలియజేస్తూ దేశ రక్షణకు కంకణబద్ధులు కావడానికి కృషి చేస్తున్న యువ ఫిఫెన్స్ కాలేజీ యాజమాన్యం అభినందనీయులన్నారు. రక్షణ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాల పట్ల అపోహాలను వీడాలని సూచించారు. యువకులు దేశ రక్షణ తమ ప్రథమ కర్తవ్యంగా భావించాలన్నారు. ప్రపంచంలో అత్యధికంగా యువత ఉన్న భారతదేశం రక్షణ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ కలిగిన యువత ఉన్న దేశం అన్ని రంగాల్లో త్వరగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, పిరమిడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యువ ఫిఫెన్స్ కళాశాల డైరెక్టర్లు పసుపులేటి వెంకటేశ్వర్‌రావు, నందికంటి భాస్కర్, భవానీ, అకాడమిక్ డీన్ అబ్దుల్లా లుక్‌మన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల వాసవి క్లబ్ నూతన కమిటీ

నేరేడుచర్ల, మార్చి 15 : నేరేడుచర్ల వాసవి క్లబ్ నూతన కమిటీని క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా గెల్లి లక్ష్మీనరసింహ, ప్రధాన కార్యదర్శిగా జూలూరి అశోక్, కోశాధికారిగా తాళ్లూరి శ్రీనివాసులు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గరిణె అరుణకుమారి, జిల్లా అధికారులు రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ వాసంతి, జోన్ చైర్మన్లు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, వనితా క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీప్రసన్న, కోశాధికారి గరిణె జ్యోతి, మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

27 నుంచి ఉండ్రుగొండ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

చివ్వెంల, మార్చి 15 : ఈ నెల 27 నుంచి 29 వరకు ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం కృష్ణకుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మూడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బందకవి కృష్ణమోహన్, యలగబోయిన శ్రీరాములుయాదవ్, కైరోజు శంకరాచారి, కలకోటి నర్సయ్య, గుండా శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యం : సీఐ రాము

కోదాడ టౌన్, మార్చి 15 : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యమని కోదాడ పట్టణ సీఐ రాము అన్నారు. శుక్రవారం పట్టణంలోని రంగా థియేటర్ ముందు నాగుబండి రామ్మూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు, స్వర్ణ భారతి ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గాదం శెట్టి శ్రీనివాస్‌రావు, కోశాధికారి ఇరుకుళ్ల చెన్నకేశవరావు, వైస్ ప్రెసిడెంట్ కిట్టు, జాయింట్ సెక్రటరీ యాద సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

అనంతగిరి : పరీక్ష సామగ్రితో గోండ్రియాల పదో తరగతి విద్యార్థులు

నడిగూడెం, మార్చి 15 : నడిగూడెం జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం బృందావనపురం గ్రామానికి చెందిన కంభంపాటి గోవిందరావు అందించిన పరీక్షా ప్యాడ్లను ఎస్ఐ అజయ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభంపాటి సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, బాణాల నాగరాజు, ఉపేందర్, హెచ్ఎం. శోభన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మ్యాథ్స్ అభ్యసన సామగ్రిని అందజేశారు. సమావేశంలో హెచ్ఎం తల్లాడ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు సాంబశివుడు రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరబోయిన హనుమంతు, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, తన్నీరు రాంప్రభు, పయ్యాముల వెంకన్న, కడెం మల్లయ్య పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్య పరిరక్షణ

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ

నాగారం : పస్తాలలో అంగన్‌వాడీ సెంటర్‌లో వివరిస్తున్న అనురాధ

నాగారం, మార్చి 15 : చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ అన్నారు. శుక్రవారం మండలంలోని పస్తాల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియన్ వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు చిరు ధాన్యాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, కవిత, సుశీల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని పులగంబండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఆర్.సైదమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారం గురించి, దాని లోపం వల్ల కలిగే ఇబ్బందులను బాలింతలకు, మహిళలకు వివరించారు. చిరుధాన్యాలను వాడడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం పాలిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం దరిచేదని, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికాలు నిర్ధిష్ట ఆహార నియమాలు పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీసుధ పాల్గొన్నారు.

కొండపైన ఉచిత విశ్రాంతి హాల్

- ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భక్తుల విశ్రాంతి హాల్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, మార్చి 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు కొండపైనే విశ్రాంతి తీసుకునేందుకు క్యూ కాంప్లెక్స్‌లో ఉచిత విశ్రాంతి హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ హాల్‌ను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. అదేవిధంగా కొండపైన మాఢవీధుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు కొత్తగా నిర్మించే భక్తుల రేకుల షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈశాన్య మాఢవీధుల్లో నెలకొల్పిన సంగీత మండపాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ మేరకు సకల వసతులను కల్పిస్తామన్నారు. ఆలయ ఈఓ బదిలీపై విలేకరులు వివరణ కోరగా దానిపై స్పందించబోనని తెలిపారు. త్వరలో యాదగిరిగుట్ట దేవస్థానంపై ప్రక్షాళన చేస్తామని, భారీ మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, ఆలయ ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, ఏఈఓ రఘు, ఈఈలు రామారావు, దయాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

హుజూర్‌నగర్, మార్చి 15 : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గరిడేపల్లి, మార్చి 15 : అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పోలీసులు పట్టుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గరిడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి నుంచి పీడీఎస్ బియ్యంను అక్రమంగా ఓ వాహనంలో తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంబంపాడు గ్రామానికి చెందిన కొండ్రకొండ గోపి అనే వ్యక్తి మరికొంతమందితో కలిసి ఇక్కడ తక్కువ రేటుకు పీడీఎస్ బియ్యంను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడించారు. బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు బియ్యంను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఎడమ కాల్వకు నీళ్లు విడుదల చేయాలని రైతుల ధర్నా

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలంటూ కోటినాయక్‌తండా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆత్మకూర్.ఎస్, మార్చి 15 : పంట చేతికొచ్చే సమయానికి నీళ్లు అందడం లేదంటూ వెంటనే నీళ్లివ్వాలని పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం, భక్తళాపురం, రంగయ్యగూడెం, తుల్జారావుపేట గ్రామాల రైతులు ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్‌తండా ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు నీళ్లు ఇవ్వడంలో అధికారులు రైతులకు సరైన న్యాయం చేయడం లేదని ఆరోపించారు. ధర్నాలో రైతులు లింగయ్య, సీతయ్య, కరుణాకర్, శంకర్, భాస్కరాచారి, వెంకటేశ్వర్లు, అజయ్, శ్రీను పాల్గొన్నారు.

బట్టలు ఆరేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మహిళ మృతి

ప్రవళిక (ఫైల్ ఫొటో)

చిలుకూరు, మార్చి15 : ఇంట్లో ఇనుప దండెంకు దుస్తులు ఆరవేస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని నారాయణపురంలో శుక్రవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా సతీశ్ భార్య గోవర్ధన ప్రవళిక (26) బట్టలు ఉతికి ఇంట్లోని ఇనుపదండెంపై ఆరవేస్తున్నది. ఈ క్రమంలో దండేనికి విద్యుత్ సరఫరా జరుగడంతో షాక్‌కు గురైంది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు వెంటనే కరెంట్ ఆఫ్ చేశారు. చికిత్స కోసం కోదాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రవళిక తండ్రి నందిగామ గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబుగౌడ్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తుంగతుర్తి, మార్చి 15 : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శుక్రవారం తుంగతుర్తి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పసునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గుమ్మడవెల్లి జనార్దన్ (70) భార్య చంద్రకళతో కలిసి తుంగతుర్తిలో పనులు ముగించుకుని ఉదయం 11 గంటల సమయంలో పసునూరు వెళ్తున్నారు. తుంగతుర్తి శివారులోని బండ రామారం మూలమలుపు వద్ద హైదరాబాద్ నుంచి గానుగుబండ గ్రామానికి వెళ్తున్న కారు అదుపు తప్పి దంపతులు ప్రయాణిస్తున్న టీవీఎస్ వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో భర్త మృతిచెందాడు. భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి బంధువు ఓరుగంటి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏడుకొండలు కేసు నమోదు చేశారు.

పోలీస్ పెట్రోల్ బంక్‌లో చోరీ

కోదాడ రూరల్, మార్చి 15 : కోదాడ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో రూ.12 లక్షలు చోరీకి గురైనట్లు పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. బంక్‌లో మేనేజర్‌గా పనిచేసే హనుమారెడ్డి నగదు తీసుకుని పారిపోయినట్లు వెల్లడించారు. దాంతో హనుమారెడ్డిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మునగాల, మార్చి 15 : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఎస్సీ కాలనీ యూటర్న్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (52) ముకుందాపురంలో ఫర్టిలైజర్ దుకాణం నందు పురుగుమందులు కొనుగోలు చేసి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌రెడ్డిని 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

సాగర్ నీటితో ఎండుతున్న పంటలను కాపాడాలి

- సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

గరిడేపల్లి, మార్చి 15 : రైతుల పొలాలు చివరి దశలో ఉన్నందున ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చివరి వరకు పంటలను కాపాడుకున్న రైతులకు చివరి దశలో బోర్లు, బావుల్లో నీరు లేకపోవడంతో పంట ఎండుతున్నందున వారు ఆర్థికంగా చాలా నష్టపోవాల్సి వస్తున్నట్లు తెలిపారు. కావున నాగార్జున సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండవన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

అర్వపల్లి : ఉయ్యాలవాడలో గాలికుంట నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి, మార్చి 15 : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. ఉచిత టీకాల పంపిణీలో భాగంగా శుక్రవారం మండలంలోని ఉయ్యాలవాడలో సుమారు 50 పశువులకు టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కెఎస్ఎస్ పద్మ, వీఎల్ఓ యాదగిరి, యాకయ్య, రైతులు మల్లేశ్, వెంకన్న, సోమయ్య, లింగయ్య, తిరుమలేశ్ పాల్గొన్నారు.

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఎంపీపీ గోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, పాడి రైతులు పాల్గొన్నారు..

నేరేడుచర్ల : రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశు వైద్యాధికారి రవినాయక్ మాట్లాడుతూ 19 ఆవులకు, 126 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లబోయిన లింగయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఊట్కూరి సైదులు పాల్గొన్నారు.

నడిగూడెం : ఉచిత గాలికుంటు శిబిరాలను విజయవంతం చేయాలని పశు వైద్యాధికారి అఖిల అన్నారు. మండలంలోని బృందావనపురం, వల్లాపురం, తెల్లబెల్లి గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 24 వరకు గోపాలపురం, సిరిపురం, తెల్లబల్లి, 25 నుంచి 29 వరకు నడిగూడెం, నారాయణపురం, రత్నవరం, 30 నుంచి ఏప్రిల్ 4 వరకు రామాపురం, రామచంద్రపురం, రత్నవరం, 5 నుంచి 9 వరకు చాకిరాల, కర్విరాల, కేశవపురం, ఈకేపేట గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సూర్యాపేట రూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి అనీల్ అన్నారు. మండలంలోని బాలెంల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తిరుమలేశ్, పాడి రైతులు పాల్గొన్నారు.

మండల కేంద్రం నుంచి పోలుమల్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

లింక్ రోడ్లతో ప్రయాణం సులభం

- ఎమ్మెల్యే మందుల సామేల్
- మద్దిరాల-పోలుమల్ల బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మద్దిరాల, మార్చి 15 : అంతర్గత లింక్ రోడ్లతో ప్రయాణాలు సులభతరమై దూరభారం తగ్గుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రం నుంచి పోలుమల్ల వరకు మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చే పనులకు రూ.5.6 కోట్లతో శుక్రవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీటీ రోడ్లపై సౌకర్యవంతంగా ప్రయాణాలు చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ప్రజా పాలన అందిస్తూ పేద ప్రజల ప్రక్షాన నిలబడుతుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని చెప్పారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్.నరేశ్, ఎంపీటీసీ మార్త అనితాకృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు నలమాస ఉపేందర్, జిల్లా నాయకులు పచ్చిపాల వెంకన్న, కసనబోయిన లింగయ్య, భూతం వీరయ్య, మల్లారపు కాశయ్య, వల్లపు రమేశ్ పాల్గొన్నారు.

ఆదర్శ నేత భీంరెడ్డి నర్సింహారెడ్డి

బి.ఎన్.చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 15 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ భీంరెడ్డి నర్సింహారెడ్డి జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భీంరెడ్డి నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నల్లగొండ జిల్లా అభివృద్ధికి బీఎన్ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగారం : భీంరెడ్డి నర్సింహారెడ్డి జయంతిని మండలంలోని ఈటూరు ఆవాసం ప్రగతినగర్‌లోని భీంరెడ్డి నర్సింహారెడ్డి స్మృతి వనం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధ్యయన వేదిక నాయకుడు కొత్తగట్టు మల్లయ్య, తాటికొండ సీతయ్య, మొల్కపురి శ్రీకాంత్, పరమేశ్, చిలకల లింగయ్య, మధు, కొండ స్వామి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై ఓపెన్ ఫోరం

నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న దృశ్యం

నేరేడుచర్ల, మార్చి 15 : నేరేడుచర్ల మండలంలో 1 ఏప్రిల్, 2022 నుంచి 31 మార్చి, 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఓపెన్ ఫోరం నిర్వహించారు. డీఆర్‌డీఓ అదనపు పీడీ బి.శిరీష మాట్లాడుతూ.. ఎంఎన్ఆర్ఈజీఎస్ 14వ విడుత రూ.3,82,24,418 చెల్లింపులు చేసినట్లు తెలిపారు. అయితే దానిలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గతేడాది 435 పనులు చేపట్టగా వేతనాల రూపంలో రూ.3,15,53,053, మెటీరియల్ కోసం రూ.66,71,365 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అయితే జనవరి 3 నుంచి 13 వరకు 11 మంది సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తనిఖీలు చేసి నివేదికలు సమర్పించినట్లు చెప్పారు. సామాజిక తనిఖీలో భాగంగా ఒక్కో గ్రామ పంచాయతీ నివేదికను డీఆర్‌పీలు చదువగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఏపీఓ శేఖర్, ఎంపీఓ విజయకుమారి, ఎస్ఆర్‌పీ కొండలు, సామాజిక తనిఖీ అధికారులు ఆశారాణి, లింగారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే కాన్షిరాం లక్ష్యం

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్

కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నవీన్

నేరేడుచర్ల, మార్చి 15 : బహుజనులకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా కాన్షిరాం పని చేశారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్ అన్నారు. నేరేడుచర్ల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షిరాం జయంతిని సహృదయ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన బహుజన వర్గాలకు అధికారాన్ని అందించి దేశ రాజకీయాల్లో కొత్త చరిత్ర లిఖించిన దేశ రాజకీయ దిక్సూచి కాన్షిరాం అని కొనియాడారు. అనంతరం 25 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జిలకర రామస్వామి, సహృదయ ఆర్గనైజర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

సీఏఏను కేంద్రం వెనక్కి తీసుకోవాలి

- సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు

బొడ్రాయిబజార్, మార్చి 15 : వివాదస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ను కేంద్ర ప్రభుత్వ